# అచ్చుతప్పులు

## పాలకోడేటి సత్యనారాయణరావు

రాఘవ చేతిలోవున్న పని పూర్తి చేసేసరికి ఆరూ ఇరవై అయింది. రోజూ ఇంచుమించు అదే వరసగా తయారయింది. ఉద్యోగము నియమానికి ఆరింటికి పూర్తవ్వాలి. కానీ ఏ అయిదున్నరకో, పావుతక్కువ ఆరుకో ఫోర్మన్ దగ్గర చేరి "బాబ్బాబూ ఆ కాస్తపనీ చేసెయ్యి" అంటాడు.

రాఘవకు ఆ సన్నివేశంలో దొర్లే మాటలన్నీ కంఠతా వచ్చేశాయి.

ఫోర్‌మన్ అన్నదానికి రాఘవ బదులేమీ ఇవ్వడు. కాగితాల్ని చేతిలోకి తీసుకొని, గడియారం కేసి చూస్తాడు తలెత్తి. ఫోర్‌మన్ నవ్వుతూ అంటాడు—"ఫర్వాలేదు, చేసెయ్యి. ఇంకా చీకటి పడలేదు గదా!" అని ఆగి మళ్ళీ అంటాడు.

"నీ ఓటీ సంగతి నేను చూస్తాన గదా" అని. అయినా తన ఓటీ సంగతి ఫోర్‌మన్ ఎప్పుడూ పట్టించుకొన్నట్లు కనపడదు. ఓటీ కోసం కాకపోయినా రాఘవ పని చెయ్యటం మొదలెడతాడు ఇంకా చీకటి పడలేదు కదా అన్న ఫోర్మన్ మాటలు గుర్తుంచుకుని.

అక్షరాలను యాంత్రికంగా చేతులో జత చేస్తోంటే రాఘవ ఆలోచనల్లో పడతాడు— తనేమీ ఇంటికి అర్జంటుగా వెళ్ళిపోవాల్సినంత అవసరం లేదు. అందుకే ఆరింటికి అయిపోవాల్సిన డ్యూటీ ఒక్కోసారి ఆరున్నర ఏడు వరకూ సాగినా, రాఘవ పెద్దగా పట్టించుకోడు.

చెంబు, మగ్గుతో నీళ్ళు తీసుకుని, చేతులను శుభ్రంగా కడుక్కున్నాడు. మురికి నీళ్ళన్నీ చిన్న కాలవలా ప్రవహిస్తోంటే క్షణం వాటికేసి పరిశీలనగా చూసి, మగ్గులో మిగిలిన నీళ్ళను ఆ కాలవలోకి పోసి బయటకు వచ్చాడు రాఘవ.

ఫోర్మన్‌కు చెప్పి ప్రెస్‌లోంచి బయట పడ్డాడు.

ఆరున్నరే అయింది కానీ చీకటిపడింది.

రాఘవ మనసు సావిత్రి మీదకు మళ్ళింది. కానీ ఇంత త్వరగా వెడితే....బాగుండదు. బాగుండదు కాదు కానీ సావిత్రి వేళాకోళ మాడుతుంది. సావిత్రి వేళాకోళం ఆడినా బాగుంటుంది కానీ........ఎందుకో రాఘవకు కొంచెంసేపు తర్వాతే సావిత్రి దగ్గరకు వెడితే మంచిదనిపించింది.

తాళంతీసి రూంలోకి వెళ్ళాడు. రూం అంతా చీకటిగా ఉంది. మునిసిపాల్టీ వీధి లైటు కొంచెంగా రూంలోకి తొంగిచూస్తూ రాఘవ కులాసా అడుగుతోంది.

ఆ వెలుగులోకి వచ్చేలా చాప వేసుకొని తలగడ మీద గుండెల్ని చేర్చి, బోర్లా పడుకొని పుస్తకం తీశాడు.

చదవబుద్ధి కావటంలేదు - ఎందుకొచ్చిన చదువు అనిపిస్తుంది. చదువుకొని ఏం చేయాలి? నిజంగా చదువుకొంటే ప్రయోజనం వుంటుందా? అర్థం కాదు. కానీ ఫోర్మన్ ఒకటే గొడవ. 'చదువుకోరాదూ - హాయిగా యీ వుద్యోగం మానేసి, ఏ గుమాస్తా పనో చేసుకోవచ్చుకదా' అంటాడు.

గుమాస్తా పని బాగానే వుండొచ్చు కానీ ఏమిటి తేడా? ఓ ఇరవై రూపాయలు, లేకపోతే ముప్ఫై రూపాయలు. అంతే! ఎటొచ్చీ తను స్టాండు ముందు నిలబడి పని చేస్తే గుమాస్తా కుర్చీమీద కూర్చుని పనిచేస్తాడు. ఆ మాత్రం దానికి రాత్రీ పగలు కష్టపడి చదవటం దేనికి?

రాఘవ పుస్తకం మూసేసాడు. చదవాలని లేకపోవటంతోబాటుగా, సావిత్రి కోసం పోవాలని కూడా అనిపించింది అతనికి.

లేచి పుస్తకాన్ని పక్కనపెట్టి, చాపను మూలకు నెట్టి రూంకు తాళం పెట్టి రోడ్డున పడ్డాడు.

కాలవదాటి, చీకట్లన్నీ ఒకేచోట ముసురుకొన్నాయా అనిపిస్తున్న కొబ్బరితోట దాటి వాడలోకి నడిచాడు రాఘవ.

అలవాటయిన చోటు కాబట్టి, అలవాటుగా రోడ్డుమీద వుండే మురికి గుంటల్ని దాటుకొంటూ చీకట్లలోంచి సావిత్రి గుడిసె చేరాడు. గుడిసె ముందు తడికె వేసివుంది. అంటే....రాఘవకు ఇబ్బందిగా వుంది.

"చచ్చినాళ్ళు....ఇంకా చీకటన్నా పడలేదు. ఎందుకు ఇంత తొందర, ఏదో కొంప మునిగిపోయేంత అర్జంటుగా వచ్చేయటం!" అని తిట్టుకుంటూ వెనక్కు వచ్చి, జంక్షన్ దగ్గరున్న కిళ్ళీకొట్టు దగ్గర ఆగాడు రాఘవ. తోచని సమయంలో ఏం చేయాలో తోచక సిగరెట్టు కొని అంటించి అక్కడున్న బెంచీ మీద కూర్చున్నాడు.

సిగరెట్టు పొగ దారి తప్పిందేమో, దగ్గు వచ్చింది రాఘవకు. దగ్గుతోంటే అతనికి చిన్నా గుర్తుకొచ్చాడు. ఎక్కడ వున్నాడో చిన్నా. అసలు తనను ఇలాటి చోటకు చేర్చింది వాడే!

'ఫర్వాలేదు రారా-ఏం కొంపమునిగిపోదు!' అని చెప్పి రోగాలొస్తాయేమోనని భయపడుతున్న తనకు ధైర్యం చెప్పి కొబ్బరితోట దాటించాడు. తోట దాటుతున్నంతసేపూ ఒకటే వుపన్యాసం-'ఏం భయపడాల్సింది లేదురా! అప్పుడప్పుడు ఇలాటి సర్దాలు తీర్చుకోకపోతే ఎలా?' అంటూ. ఇలాటి చోట్లకు తిరగటం దేనికి? హాయిగా పెళ్ళి చేసుకొంటే పోదూ అన్నాడతను ఆ రోజున. చిన్నా నవ్వేశాడు పకాలున. నవ్వి, నవ్వు ఆపుకొంటూ తన నవ్వుకు ఆ తర్వాత అర్థం చెప్పాడు - 'నీ కొచ్చే జీతం యెంత? రోజుకు ఆరు రూపాయలు. అంటే సెలవురోజులు తీసేస్తే నెలకు నూట యాభై రూపాయలు. ఈ నూట యాభైలో నువ్వెంత తింటావ్, నీపెళ్ళాంకేం పెడతావ్? అందుకే మనకు అలాటి బాధలు లేకుండా వుండేందుకే ఇలాటి వాడలు! ఇలాటి చోట రోజుకో అర్ధరూపాయి పారేస్తే రోజుకో కొత్త పెళ్ళాం దొరుకుతుంది!! ఎంచక్కా నిత్యశోభనం'

రాఘవకు చిన్నా అన్న మాటలన్నీ మనసుకు పట్టాయి. నిజమే, పెళ్ళాం వస్తే ఒక్క 'రాత్రి సుఖం' తప్పితే ఇంకేం మిగులుతోంది కష్టాలు అవస్థలు తప్ప. ఆ మాత్రం దానికి

అవస్థపడటం దేనికి, రోజూ కొబ్బరితోట దాటితేసరి!

మొదటి రోజునే చిన్నా పరిచయం చేసిన సుఖం రాఘవకు సంతోషాన్ని ఇచ్చింది. మర్నాడు అదే సుఖాన్ని వెతుక్కొంటూ వెళ్లాడు ఒంటరిగా. చిన్నాకు చెబితే 'అంత బాగుందా?' అని నవ్వేస్తాడనిపించి చిన్నాకు చెప్పనేలేదు. ఆ రోజున పరిచయం అయింది సావిత్రి.

సావిత్రి గుర్తు రాగానే, సగం కాల్చిన సిగరెట్ పారేసి లేచాడు. దూరాన్నుంచి చూసి తడిక తీసే వుందని దృఢపర్చుకొని అటుకేసి నడిచాడు.

సావిత్రి రాఘవను పోల్చుకుని "రా!" అంది.

రాఘవ వచ్చి అరుగుమీద కూర్చుంటూ అన్నాడు—"ఇంతకు మునుపొకసారి వచ్చి వెళ్ళాను! తడికె వేసి వుంది."

రాఘవ మాటల్లో వ్యక్తం అవుతోన్న కోపాన్ని గుర్తిస్తూ నవ్వుతూ అంది సావిత్రి "ఇంకా యెవరూ రాలేదు. నేనే చిరకట్టు కొంటూ తడికె వేశా!"

రాఘవ అనుమానంగా చూసినట్టుగా అనిపించి మళ్ళీ సావిత్రే అంది: "నిజం-నీదే తొలిబోణీ! రా, లోపలకు!"

సావిత్రి లోపలకు నడుస్తూంటే రాఘవ కూడా వెళ్లాడు. రాఘవ లోపలకు వచ్చి, తడికె దగ్గరగా వేస్తున్న సావిత్రితో అన్నాడు "నా దగ్గర డబ్బులేమీ లేవు. తడికె వెయ్యకు."

సావిత్రి నవ్వింది— "తొలి బేరమే అరువా? ఈ వ్యాపారంలో అరువు లేదని చెప్పాలా?" అంటూ తడికె వేసింది. తాడుతో కట్టేస్తూ రాఘవ ముఖంలోకి పరిశీలనగా చూసింది. రాఘవకి ఇంకా యిందాకటి ఉక్రోషం తగ్గినట్లు లేదనుకొంటూ నవ్వుతూ అంది—"అరువయినా పరవాలేదులే-నువ్వే కదా. ఎక్కడకి పోతాయి డబ్బులు!"

రాఘవ మంచం మీద కూర్చున్నాడు. పక్కన చేరుతూ అంది సావిత్రి: "డబ్బులు లేకుండా దేనికి వచ్చినట్లు ఇక్కడకు?...." అంటూ అతని జేబు తడిమింది. ఆ స్పర్శకు రాఘవలో కోరిక కదిలింది. సావిత్రిని నెమ్మదిగా దగ్గరకు తీసుకొన్నాడు. "అరువు బేరమైతే కుదరదు" అంటూ సావిత్రి నవ్వుతోంటే, ఆమెను ఆక్రమించుకొన్నాడు రాఘవ.

కాస్సేపు తర్వాత రాఘవ గుండెల మీద చెయ్యివేసి నిమురుతూ అడిగింది సావిత్రి: "నాకు సినిమా చూపిస్తానన్నావ్, రేపా, ఎల్లుండా?"

క్షణం ఏమీ అనలేదు రాఘవ.

"డబ్బుల్లేవా నిజంగా? పోనీ నేను తెస్తానులే—వూరికే నీతోబాటుగా చూద్దామని, అంతే!"

"రేపు సాయంత్రం కృష్ణా దగ్గరకురా, నేనుంటానీకోసం అక్కడ!"

"సాయింత్రం ఆటకు వద్దు, నాకు...." అని ఆగి అంది— "మధ్యాహ్నం ఆటకు వెడదాం సరేనా?"

రాఘవ ఊ అన్నాడు. సావిత్రికి చాలా కాలంగ వున్న కోరిక అది. తను తీరుస్తానని చెప్పాడు. ఈరోజు మళ్ళీ గుర్తు చేస్తోంది. సావిత్రి కోరిన కోరిక తీర్చటం పెద్ద కష్టమూ కాదు, ఇబ్బందీ లేదు. అక్కడికొచ్చి సావిత్రి నిలబడుతోంది. తను టిక్కెట్లు కొన్నాక తన వెనుకే సావిత్రి ఫాలో అవుతుంది. కలిసి సినిమా చూడాలనే ఆమె కోరిక తీరుతుంది.

సావిత్రి కోరిన కోరిక ఆరోజు సాయంత్రం తీర్చాడు రాఘవ. ఫోర్‌మన్‌తో తనకు జ్వరం వస్తున్నట్లుగా వుందని చెప్పి మధ్యాహ్నానికి సెలవు తీసుకొని కృష్ణా దగ్గరకు చేరేసరికి ఎదురుగా సిద్ధంగా సావిత్రి.

ఎంత అందంగా వుందని! సావిత్రి రోజూ అలంకరించుకోవడం తప్పనిసరి. అవసరం. ఆకలి తీర్చుకోవాలంటే ఆమె మనసుకు రంగుల్ని పూసి, ముఖానికి పౌడర్ని దట్టంగా దట్టి, మనసులో లేని హొయల్ని ముఖం మీదకు తెచ్చుకొని వసారాలోకి వచ్చి నిలబడటం ఆమెకు తప్పనిసరి. సావిత్రి అలా అలంకరించుకొన్న రోజులు తనకెన్నో గుర్తు వున్నాయి.

కానీ ఈరోజు వేరు— సావిత్రి ముఖాన పౌడర్ మందంగా లేదు. కానీ మనసులో దాగని సంతోషం ఆమె ముఖం మీదకు పాకి, కొత్త అందాన్ని ఆమెకు అందించింది. తన కోరిక తీరుతోందన్న సంతోషం ఆమె అణువణువులో నిండి ఆమె అందానికి మెరుగులు దిద్దింది. పెళ్ళాం కాదుకదా, ఆఖరికి ఏ ఆడదానితోనూ సినిమాకు వెళ్లని రాఘవకు సైతం ఆ రోజు కొత్తగా తమాషాగా అనిపించింది.

సినిమా మధ్యలో 'బంగాళాదుంప వేపుడు ముక్కలు' తిన్నారు. టీ తాగారు. సినిమాను చూసి ఆనందించటంకన్నా, పక్కన వున్న వారి తోడును మాత్రమే వారెక్కువగా అనుభవించారు.

సినిమా అయిపోయాక సావిత్రిని నెమ్మదిగా పరుచుకొంటున్న సంధ్య చీకట్ల మధ్య లోంచి నడిపించి తెచ్చాడు రాఘవ. తన గది ముందునుంచి వెడుతోంటే చూపించాడు- "ఇదే నా గది" అంటూ.

సావిత్రి ఆ గదికేసి ఆబగా చూసుకొంది.

సావిత్రి గుడిసె చేరాక అతన్ని ఆప్యాయంగా అల్లుకొంది. ఈ అల్లుకోవటంలో రోజూకన్నా ఎక్కువ తృప్తిని అనుభవించాడు రాఘవ. రోజూకన్నా ఎక్కువసేపు అక్కడ కూర్చోవాలని, సావిత్రితో మరింత సేపు గడపాలని అతనికి అనిపించినా, దాని వల్ల సావిత్రి వ్యాపారం దెబ్బ తింటుందనుకొని రాఘవ బయటకు వచ్చేశాడు.

వాడలోంచి, కొబ్బరి తోటలోంచి బయటకు వచ్చి కాలవదాటి గదికి వచ్చేంతవరకు రాఘవ మనసులో ఎన్నో రకాల ఆలోచనలు. కానీ సావిత్రే వాటి కేంద్రస్థానం.

అతని ఆలోచనల్లో కొన్నిటికి తాను కార్యరూపం ఇస్తున్నట్లు మర్నాడు సాయంత్రం

## స్వేచ్ఛ

దప్పిక చెపుతుంది నీటిని గురించి
ధరిత్రి చెపుతుంది శిథిలమైన నాగరికత గురించి
శాంతి చెపుతుంది జరిగిన యుద్ధాల గురించి
ప్రేమ చెపుతుంది జ్ఞాపకాల బూజు గురించి
పక్షులు మాత్రమే చెపుతాయి స్వేచ్ఛ గురించి

—పద్మపాణి

రాఘవ ప్రెస్‌లోంచి బయటకు వచ్చేసరికి రాఘవ ఇంటి ముందు తచ్చాడుతూ సావిత్రి. గదిలోకి చేతిలో సూట్‌కేసుతో సావిత్రి వచ్చేసరికి రాఘవ ఆశ్చర్యపోయాడు- "ఏంటి ఇలా వచ్చేశావ్!'' అనడిగాడు సూటిగా.

సావిత్రి నవ్వింది. ఆ నవ్వులో ఆశలు. ఆ నవ్వులో కోరికలు. ఆ నవ్వులోనే కొంత భయం.

నెమ్మదిగా చెప్పింది సావిత్రి - తనకా రొచ్చుగుంట జీవితం నచ్చటం లేదని. తను ఆ గుంటలోంచి బయటకుపడే మార్గం కోసం ఏళ్ళతరబడి వెతుకుతోందని. రోజూ ఓ కొత్త మొగుడి కోసం వెతుక్కోవటం తనకు కష్టంగా వుంటోందని. ప్రతి మగాడికి డబ్బు కోసం తను తన అందాన్ని అందించటం నచ్చటంలేదని. దానికి బదులుగా మగాడేం అందిస్తాడోనని భయం తన్ను చుట్టుముడుతోందని. రోజుకో వంచ కిందన తల దాచుకోవటం కన్నా తనదైన చిన్న నీడ తనకుంటే మంచిదనిపిస్తోంది.

రాఘవ అంతా విన్నాడు.

"సావిత్రీ-నా సంగతి నీకు తెలీంది కాదు. రోజూ వచ్చే జీతం ఆరురూపాయలు. పని చేయకపోయినా, పనీ చేయలేక పోయినా అంతేది ఏదీ వుండదు. ఆ డబ్బుతో నా వొక్కడి జీవితమే కష్టంమీద గడుస్తోంది. ఇంకొకర్ని పంచుకోవటం కష్టం. పైగా ఇంతకాలమూ నువ్వు స్వంతంగా సంపాదించుకొంటూ బతుకు గడిపేదానివి. ఇకపై అలా జరగదు. నీకది కష్టం అవుతుంది—"

సావిత్రి అతని భయాన్ని కొట్టిపారేసింది.

"నాక్కావాల్సింది బతకటమే అయితే అది నాకు కష్టంకాదు. నాకు కావాల్సింది డబ్బే అయితే అది సంపాదించుకునే మార్గము నాకు తెలీందికాదు. కానీ నాకు కావాల్సింది యీ రెండూకాదు. నాకంటూ ఓ స్వంత యిల్లు. ఓ స్వంత మొగుడు. వాటికోసం—నువ్వు వుంటానంటే కష్టాల్ని నష్టాల్ని భరించటం నాకు కష్టంకాదు."

నీతో జీవితాన్ని పంచుకొంటాను అంటూ వచ్చిన సావిత్రిని కాదనడం రాఘవకు సాధ్యం కాలేదు. సావిత్రిని తనతో ఉండమన్నాడు కష్టాల్నీ, ఇబ్బందుల్నీ కలిసి అనుభవిద్దాం అంటూ.

తాళికట్టకుండా, అనుకోకుండా, అంచ కుండా ఆ ఏకో కుటుంబం ఏర్పడిపోయింది.

ఆరోజు రాత్రి సావిత్రితో అందమయిన క్షణాల్ని పంచుకొంటూ చెప్పాడు రాఘవ పెళ్ళంటే తనెందుకు యింతకాలం భయపడ్డాడో. కానీ తన జీవితంలోకి తోసుకొని వచ్చేసిన అమ్మాయిని కాదనటం దేనికని, ఊ అంటున్నాడో కూడా చెప్పాడు.

సావిత్రికి అతను కొత్తకాదు. అతనికి సావిత్రీ కొత్తకాదు. ఆమెలో అణువణువు తోనూ అతనికి చిరపరిచయం వుంది. ఐనా ఆరోజు రాత్రిమాత్రం ఇద్దరికిద్దరూ కొత్తగా, కొత్త అనుభవాలను ఆత్రంగా జుర్రుకొన్నారా అనిపించే విధంగా ప్రవర్తించారు.

తెల్లగా తెల్లవారింది.

ఇంతక్రితం రాఘవకు జీవితంలో-రోజు మొదలయ్యేటప్పుడు - దినచర్య ఒకవిధంగా ఉండేది. నిద్రలేచీ లేవగానే నీళ్ళకోసం పరుగు. వీధిచివర్న వుండే మునిసిపాలిటీ పంపులోంచి సన్నగాజారే నీటిచుక్కల్ని జాగ్రత్తగా పట్టుకోవటంతో జీవితం ఆరంభమయేది. ఆ తర్వాత ఆ నీళ్ళతో ముఖం కడుక్కోవడం, స్నానం చేయడం—యిక కంపటిమీద ఏదో కొంత వండుకోవడం—తర్వాత ప్రెస్‌కేసి పరుగు.

ఆరోజు రాఘవ నిద్రలేచేసరికి కొత్తజీవితం అతనికోసం ఎదురుచూస్తోంది. గదిముందు అతనికోసం చెంబుతో నీళ్లు, వేపపుల్లసిద్ధంగా వున్నాయి. కంటికి కనిపిస్తూ ఎదురుగా బకెట్ నిండా నీళ్లు. మరోపక్క సావిత్రి.

రాఘవ పక్కమీదనుంచి లేస్తూ సిగ్గుపడ్డాడు—

సావిత్రి నవ్వుతూ మేల్కొలుపు పాడింది "లేచివెళ్ళి కొంచెం టీపొడి తే—టీ తాగుదాం!"

రాఘవ మొహం కడుక్కోవడం పూర్తి కాగానే, పెట్లోంచి అయిదురూపాయలనోటు అందించింది అతనికి.

"నీ డబ్బులా?"

"నావీ కావు, నీవీ కావు. ఇవి మనవి. నా దగ్గర ఇంకో ఇరవై రూపాయలున్నాయి. అవీ అయిపోతే ఇక నీ డబ్బులతోనే ఇల్లు జరగాలి!" అంది సావిత్రి.

రాఘవకు ఆమె డబ్బు తీసుకోవాలంటే యిబ్బందిగా అనిపించింది కానీ, తప్పదు. తన దగ్గర లేనపుడు తాను ఆమె డబ్బుపె



ఆధారపడటం తప్పనిసరి అనుకొని నోటు అందుకున్నాడు.

ఇరవై రూపాయల్నీ జాగ్రత్తగా ఉపయోగించినా, వాళ్లకు అయిదారు రోజులకన్నా ఎక్కువరాలేదు.

పైగా రెండు రోజులనుంచీ రాఘవ మనసంతా చికాగ్గావుంది.

ఇంట్లో రెండురోజుల తర్వాత తినాలంటే ఒక్క బియ్యపు గింజయినాలేదు. ఇంతక్రితం పరిస్థితివేరు. ఇలాంటి యిబ్బంది వస్తే యే ఫోర్‌మన్‌నో రెండ్రూపాయలు అప్పడిగితే ఆయన కనీసం రూపాయయినా యిచ్చేవాడు. ఇప్పుడు రూపాయి అప్పు తీసుకుంటే పని గడవదు అని రాఘవకు తెలుసు.

ప్రొప్రయిటర్‌గార్ని అడ్వాన్సు కావాలని అడిగాడు. ఎప్పుడూ అడగనివాడు అడిగాడు కదా అనయినా ఆయన యివ్వలేదు. బహుశా మొదటిసారి ఇస్తే అది రెండోసారికి దారి తీస్తుందనేది అతని భయం కాబోలు!

చేస్తున్నది తప్పుపని అని తెలిసినా, ఇక వేరు గతిలేదనుకొంటూ రాఘవ సావిత్రి దగ్గరగా వచ్చేడు.

గదిచుట్టూ నెమ్మదిగా చీకట్లు పరచుకొంటున్నాయి.

గదిలోపల చిన్నదీపం—సావిత్రి.

రాఘవ వచ్చేసరికి దీపం వెలిగిస్తున్న సావిత్రి, అతన్నిచూసి లేచినిలబడింది ఆదరంగా.

రాఘవ అడుగులో అడుగు వేసుకొంటూ వచ్చి చాపమీద కూర్చున్నాడు. సావిత్రి అందించిన గ్లాసు మంచినీళ్లను అందుకొని, నోటిని తడుపుకుంటూ, గొంతులో ఆగిపోయిన పదాలన్నిటినీ తడిపి పైకి తెచ్చుకొన్నాడు.

"సావిత్రీ...."

పక్కనేవున్న సావిత్రి అతనికి మరింత దగ్గరగా జరిగింది.

అతను చెప్పటం ప్రారంభించాడు. "నేను చెప్పేది పూర్తిగా, జాగ్రత్తగా విను సావిత్రీ-నీ ఇష్టం యేమిటో చెప్పు! నీకు తెలుసు, తెల్లారితే ఇంట్లో బియ్యపు గింజయినాలేదు. నా ప్రయత్నాలన్నీ చేశాను. కానీ ఎక్కడా పైసాకూడా దొరికే అవకాశం లేదని తెలిసింది. అందుకని...." ఆగిపోయాడు.

"చెప్పు!" అంది సావిత్రి.

"నర్సింహ అని ప్రెస్‌లోనే నాతో పని చేసే కంపోజిటర్ అన్నాడు. నిన్నుచూశాట్ట. ఒకసారి ఊ అంటే మూడురూపాయలు ఇస్తానన్నాడు. దూరంగా ఆ లైటు స్థంభం కింద నువు ఊ అంటే...."

సావిత్రి పకాలున నవ్వింది. రాఘవ పేర్చుకొంటూ పలుకుతున్న పలుకులన్నీ ఉన్నట్టుండి ఆగిపోయాయి.

"నవ్వుతావేం?"

"నవ్వక—ఈ మాత్రం దానికే యింత ఆలోచించావా? రమ్మను. నాకు అదేం కొత్త కాదుగదా?" అంది సావిత్రి.

"నువ్వేమీ అనుకోవుగదా?" అడిగాడు మళ్ళీ.

"ఫర్వాలేదన్నాగా!"

సావిత్రి రెండోసారి కూడా ఊ అన్నాక రాఘవ గదిలోంచి బయటకు నడిచాడు. త్వర త్వరగా నడుస్తూ, లైటుస్థంభం దగ్గరున్న నర్సింహను పంపాడు, అతను అందించిన మూడురూపాయలూ అందుకొని.

రాఘవ లైటుస్థంభానికి అనుకొని సిగరెట్టు అంటించాడు. తప్పు చేశాననే భావన అతనిలో సెగలా మండుతోంది. సిగరెట్టు పొగ అతన్ని ఎందుకిలా చేశావని ప్రశ్నిస్తున్నట్టుగా చుట్టూ తిరుగుతోంది.

నాలుగయిదు నిమిషాలలోనే నర్సింహ తిరిగి వచ్చేశాడు. రాఘవచేతిలో డబ్బును లాక్కుంటూ అన్నాడు నర్సింహ—"ఎవరున్నార్రా గదిలో. ఖాళీగదికి పంపి మూడు రూపాయలు...." బూతు మాటలతో వాక్యం పూర్తి అయిపోయింది.

రాఘవ ఆశ్చర్యపోయాడు.

పరుగు పరుగున గదికి వచ్చాడు.

ఖాళీగది.

సావిత్రి లేదు, సరికదా ఆమె సూట్‌కేస్ కూడా లేదు.

గదిని కొంచెం పరిశీలించిచూస్తే, గదిలో అసలు సావిత్రికి సంబంధించిన సామాన్లు ఏవీలేవని స్పష్టమయింది.

రాఘవ క్షణం గదిలో నిలబడి, గదిలోంచి బయటకువచ్చి, కొబ్బరితోటకేసి నడిచాడు.

కాలవదాటి, చీకట్లన్నీ ఒకేచోట ముసురుకున్నాయా అనిపిస్తున్న కొబ్బరితోట దాటి డలోకి నడిచాడు రాఘవ. అలవాటయిన చోటు కాబట్టి, అలవాటుగా రోడ్డుమీదవుండే రికి గుంటల్ని దాటుకొంటూ, చీకట్లలోంచి సావిత్రి గుడిసె చేరాడు.

సావిత్రి అరుగుమీద నిలబడి వుంది. ఆ నిలబడటమే రాఘవకు ఇబ్బందిగా తోచింది.

"రా!—" అంది సావిత్రి రాఘవనిచూసి.

రాఘవ అరుగుమీద కూర్చున్నాడు.

"కోపం వచ్చిందా?" అని సావిత్రి నవ్వింది. పక్కనే కూర్చుంటూ అంది—"యీ బతుకు బాగలేదని కదా నీ దగ్గర నీ భార్యగా బతకాలనుకున్నాను. తిండి తిప్పలు లేకపోయినా పర్వాలేదనుకొన్నాను. సానిగా కాక సంసారం చేసుకోవాలని తాపత్రయ పడ్డాను. కానీ మరి అదేం ఖర్మమో—నీ పద్ధతి మారింది. ఇంత కాలమూ నువ్వు వచ్చేవాడివి. ఈరోజు ఇంకోడ్ని తెచ్చావు. అంటే తార్చటానికి దిగావన్నమాట! నేనో మెట్టు పైకి వెళ్లాలనిచూస్తే, నువ్వోమెట్టు జారాలను కొన్నావు. ఆ మాత్రం డబ్బు నేను సంపాదించుకోలేనా? నీ డబ్బుతో నువ్వు మామూలుగానే బతకగలవు గదా! నేను రాబట్టే నీకాశ్రమ-బతుకులోకిందకు జారటం" సావిత్రి ఆగింది.

మళ్ళీ తనే అంది తేరుకుంటూ "సానిగా బతకాలనే రాసివుంటే అది నీ గదిలో ఎందుకు? ఇక్కడే చేసుకొంటా ఆ పని—

"మీ ప్రెండన్నావ్ చూశావూ-పంపించు. నాకేం అభ్యంతరం లేదు. కానీ ఆ డబ్బులో నీకు పైసాకూడా రాదు, గుర్తుంచుకో!" అంది సావిత్రి.

రాఘవ నిలబడ్డాడు.

"రాఘవా—మాట! నేను చెడిపోయిన దాన్నే. నేను ఇంకా కొంచెం చెడినా, చెడిన దాన్నే అవుతాను. నువ్వు—నువ్వుమాత్రం యింకా చెడకూడదని ఈ పని చేశాను. నువ్వు మామూలుగా వస్తూనే ఉండు.... సరేనా?" అంది సావిత్రి.

చీకటి. చిక్కని చీకటి. కాటుకలాటి కన్ను పొడుచుకున్నా ఏమీ కనపడనంత చీకటి.

అంత చీకట్లోకూడా రాఘవ తలెత్తి సావిత్రికేసి చూడలేకపోయాడు.